

# శవం

"కబురెళ్ళిందా" పదోసారి కాబోలు అడిగాడు వెంకట్రాముడు.

"ఎళ్ళిందెళ్ళింది - పదిసార్లేం కరమలచ్చసార్లెల్లింది. ఏటా ఏదో ఒక ఇదంగా తప్పించుకుంటున్నాడు. అతగానికేంటా దరజావో అరదం కావట్నేదు. మనిద్దరం మాత్రం ఈ దిక్కుమాల్న పనికి మిగిల్నాం" అంటూ విసుగును, కాస్తంత కోపాన్ని మిళాయించి జవాబిచ్చాడు పాడె కడ్తున్న సీతారాముడు.

నాలుగువైపులా తాటి తడపల్తో బాగాబిగించి కట్టాక చెమటనువేళ్ళతో వూడ్చి క్రిందికి విసిరికొట్టి ఎండలోంచి కొద్దిగా నీడకొచ్చాడు.

పాడెని శల్య పరీక్ష చేస్తున్నాడు వెంకట్రాముడు.

"అరటిపండూ, కొబ్బరికాయ, ఊదొత్తులు కూడా తేవాలి తెల్సిందా! సత్తెయ్య రావటమేమిటి.. దీనిమీద తొంగోబెట్టాల" కరాఖండీగా నిర్ణయించాడు వెంకట్రాముడు.

"అయినా నాకు తెలవకడుగుతాగాని, సత్తెయ్య కిన్నేళ్ళు ఒచ్చినాయి గందా, ఈ ఏసకం కట్టటానికి ఎందుకిలా జంకుతాడు. ఆర్నూరయినా నూరారయినా యీ ఏటికి ఆడే యీ ఏసకం కట్టాల" ఆగ్రహం కనపరిచాడు సీతారాముడు..

వాళ్ళలా పాడెని సిద్ధపరచాక. ఓవారగా ఆపిన రిక్షాల్లో కూలబడ్డారు.

వారి బుర్రలో పాదరసం కంటే వేగంగా ఆలోచనలు పట్టుచిక్కకుండా

పరిగెడ్తున్నాయి. ఓ వైపు సత్తెయ్య రాకకోసం గుండెల్లో ఉత్కంఠ... ఈ జాతరలో నొర్లుకోబోయే సొమ్ముతో పూటుగా సారా తాగగలమాన్న మీమాంస మొదలైనాయి.

"ఒరి! సీతారావన్నా! యిదిగోర్రా! సత్తెయ్యమావ! రాన్నానని మొండోదం మొదలెడ్తే బరబర ఈడ్చుకొచ్చినాం" ఘనకార్యం నెరపినట్టుగా చెప్పాడు చీనయ్య.

యమదూతలు నరకానికి ఈడ్చుకొచ్చి యముడికి అప్పచెప్పినట్లుగా వరాలు, చీనయ్య కలసి సత్తెయ్యను వారి సమక్షంలో వుంచారు...

శ్రాద్ధపిండం చూడ్డంతోటే అల్లంత దూరంనుండే ఆబగా రెక్కలు టపటపా కొట్టుకుంటూ వచ్చి వాలిన కాకుల్లా వెంకట్రాముడు, సీతారాముడు రిక్షాల్లో నుండి క్రిందికి ఒక్కదూకు దూకారు.

"ఏట్రా! ముసల్నా కొండే! నీకేం పోయేకాలంరా! అరిచేది... సొమ్ము చేసేది మేం! నొస్తే మా నోళ్ళు నొస్తాయి గాని నీకేంరా హాయిగా దీనిమీద కెక్కి తొంగోక - కాదన్నావంటే మక్కలిరగదంతాం" గదమాయించాడు సీతారాముడు.

"ఒరే! మీకు పున్నెం వుంటాది. నన్నోగ్గేయండ్రా - ఎండ పెళపెళ్ళాడి పోతూంది... నాకసలే జొరం... కాళ్ని కట్టెనాగ ఒల్లు కాలిపోతున్నాది. ఈపాలికి నన్నొదిలిపెట్టండి" మొరపెట్టుకున్నాడు సత్తెయ్య.

"ఒరే సత్తిగా! అలా అనమాకురా! అపసారం! అమ్మోరికి ఆగ్రహం వచ్చినాదంటే నిన్నీ జాతర్లోనే తనలో కలిపేసుకుంటాది - "బెదిరించాడు వరాలు.

నయానా భయానా చెప్పి చూసారు రిక్షాయూనియన్ వాళ్ళు.

వాళ్ళకందరికీ లీడర్ వెంకట్రాముడు. అతని మాట వాళ్ళకందరికీ వేదమే! అయితే ఈ జాతరలో వేషాల విషయంలో తగువులు రావటం వాటిని తీర్చి ఓ కొలిక్కి తెచ్చి, ఒడంబడిక చేయటం మామూలే వెంకట్రాముడికి

ప్రతియేడు జాతరకి రిక్షావాళ్ళు ప్రతీ ఒక్కరూ ఏదో ఒక వేషం వేస్తారు. ఆ వేషాల క్రింద పోగయిన మొత్తాన్ని కలసి పంచుకుంటారు.

చాకుల్లాంటి కుర్రాళ్ళందర్నీ నాగినీ వేషాలకి ఎంపిక చేస్తారు. పిల్లకాయల్లాటి వారికి దొంగ-పోలీసు వేషాలు కట్టిస్తారు.

నడివయస్కులు బండి వేషాలు వేస్తారు... (రాముడు, కృష్ణుడులాటి వేషాలు వేసుకుని బండిమీద వూరేగటం)

ఇంక ముసలివాళ్ళకి మాత్రం శవంవేషం రిజర్వ్ అయిపోతుంది. ఏభయ్యావ

పడిలోపడి రిక్షా ఈడుస్తున్న వారికి జాతరొస్తే పెద్ద గండంలా అనిపిస్తుంది. ఆ వేషం వేయడానికి ఎవరూ ముందుకు రారు. పై పెచ్చు బ్రతికుండగానే శవంగా మారి పాడెమీదకి చేరటమంటే భయంకరమైన పీడకల కన్నట్టుగా అదిరిపోతారు. బూచాడ్ని చూసి చిన్నపిల్లలు జడుసుకున్న రీతిగా హడలిపోతారు.

ప్రతీసారి ఏదో వంకతో తప్పించుకుంటూ వచ్చిన సత్తెయ్యను ఈసారి జాతరకి వదిలిపెట్టదలచలేదు. వెంకట్రాముడు వగైరాలు...

"నువ్వీసారికి శవం వేషం వేయాల్సిందే!"

తుపాకీ గుండు శబ్దం విన్న పిట్టలా గడగడ వణికిపోయాడు వెంకట్రాముడి గొంతువిన్న సత్తెయ్య.

మాటమాట్లాడే శక్తిక్షీణించిపోయింది సత్తెయ్యలో. జీవితంలో బ్రతికుండగా శవం వేషం వేయకూడదనుకున్న అభిప్రాయం - అతన్ని వెక్కిరించి పారి పోయింది.

తమ యింట్లో తన ఆడమనిషి, పిల్లలూ - శవం వేషం వేయటం చూస్తే ఎంత దుమ్మెత్తిపోస్తారో!! అంతేకాక తీవ్రమైన జ్వరతాపంతో... నిప్పులు చెరిగే ఈ ఎండలో - ఎలా వూరేగటం?? ఒక్కసారి వణికింది వెన్ను.

"ఒరే! ముసల్నాకొడకా! పాడెక్కరా! నువ్వొల్లకే తొంగునుంటావుగాని...నీ గురించి బతికుండగానే ఏడ్వడానికి మేం ఎక్కడ్లేని సత్తువా తెచ్చుకోవాల్రా! ఆ సత్తువకి ఓ పాకెట్ సారా గొంతులో ఓసుకోవాల్రా అదీ సంగతి. యింక నువ్వు శాంతంగా ఎక్కు" అని సత్తెయ్య ముఖాన పెద్ద కుంకుమబొట్టు గీసి నలుగురు సాయంపట్టి ఒద్దుఒద్దు అంటున్నా వినకుండా పాడెక్కించారు.

తలదిక్కుగా అరటిపండ్లు పెట్టి దానికి ఊదొత్తులు గుచ్చాడు కాసిం.

కాసిం యింకా నల్గురైదుగురు యువకులు నాగినీ డాన్స్‌ల్లో ఛాన్సులేక శవం ముందర ఏడ్చి గగ్గోలు పెట్టడానికి వెంకట్రాముడే సెట్ చేసాడు.

వాళ్ల సారా బాగా వట్టించేయటంవల్ల నరాల్లోంచి హుషారుని ఒంటపట్టించుకొని గెంతడానికి సిద్ధంగా వున్నారు. పాడె కదిలింది.

సత్తెయ్య గుండెల్లో ముల్లు దిగినంత బాధ మొదలైంది.

★ ★ ★

ఆంధ్రరాష్ట్రంలో ఎక్కడా కనివినీ ఎరుగని జాతర - విజయనగరంలో జరిగే సిరిమాను జాతర. ప్రాంతీయులు పైడి తల్లమ్మ పండుగంటారు.

నిత్యజీవితంలోని సమస్యల్లో విసిరివేసారిపోయిన వారికీ పండుగ ఆటవిడుపు. అందుకే ఎక్కడున్నా ఆ పండుగకి రెక్కలు కట్టుకు వాల్తారు జనం.

మొత్తం రెండురోజుల పండుగ. ముందర రోజుని తొలేళ్ళు అంటారు. ఆ రోజు మొదలు నాలుగయిదు రోజులుదాకా నగరం అంతా రంగురంగుల విద్యుద్దీపాలతో కళకళ్లాడి పోతుంది. ఎక్కడ చూసినా రికార్డింగ్ డాన్సలు - బుర్రకథలు... నాటకాలు.. ఆర్కెస్ట్రా ఎక్సెట్రాలు...

తొలేళ్ళ రోజు వుదయం నుండే ప్రారంభమౌతుంది వేషాల కోలాహలం. ఏ వీధికావీధి తమ గొప్పతనం, రౌడీయిజం, తమ అంగబలం చాటుకోవాలని వేషాల్లో తమ ప్రతిభను చాటాలని ఉవ్విళ్లూర్తూ - దానికోసం కొన్ని వందల రూపాయలు ముందుగా ఖర్చు చేస్తారు.

విజయనగరంలో లంక వీధికీ సుంకర వీధికీ పులివేషాల పోటీ రాజుల కాలం నుండే వున్నది. లంకవీధికి అప్పారావు పార్టీ పులివేషానికి దిగితే సుంకర వీధికి చంద్రావు పార్టీ దిగుతుంది. యింక నాగాసపు వీధి, బొండాడ, పుత్సల వీధులు రంగంలోకి దిగటం మామూలే!

లంక వీధి లంక వీధే...!!

ఆనాడు రామాయణంలో 'లంక'కి ఎంత ప్రాధాన్యతుందో విజయనగరంలో లంకవీధి పేరు చెబితే గుండెల్లో దడపుడ్తుంది విజయనగరం వాసులకి.

జాతరలో రకరకాల వేషాలు సంచలనం కల్గిస్తాయి. ఒక్కోసారి వాగ్వివాదాలు చెలరేగి పోటీలు పెరిగి గాల్లోకి బాణాకర్రలు లేచి - సోడా బుడ్డీలు ఎగరటం, బుర్రలు విడిపోవటం కూడా మామూలే ఆ పండుగకి.

అటువంటి పండుగలో వేషానికంటూ ఏ ఖర్చు చేయకుండా వేసే వేషం 'శవం వేషం'

ఈ వేషం కూడా రెండుమూడు వీధుల వాళ్ళు వేస్తారు. కాని రిక్షావాళ్ళదే రాణిస్తుంది.

అచ్చు - చచ్చినవాడికి జరిపినట్లే అన్నీ జరిపినట్లు నటిస్తారు. కొంతమంది అదివేషం అని తెలీక కాబోలు - జాలిగా నిట్టూర్చటం కూడా పరిపాటే!

ఎవరే వేషం కట్టినా ముందుగా పైడితల్లమ్మని మ్రొక్కటం - తర్వాత అక్కడ్నించి వీధివీధీ తిరగటం ప్రారంభిస్తారు.

"దించండ్రా!" అన్నాడు వెంకట్రాముడు.

వరాలు వాళ్ళు దించారు. అంతా గుడిలోకి వెళ్ళి కొబ్బరికాయ కొట్టి బయటపడ్డారు.

పూజారి యిచ్చిన కుంకుమతో అందరి నుదుట పావలా కాసంతా బొట్టు పెట్టాడు కాసిం!

మళ్ళా లేచింది పాడె!

జనం అందరిమీద ఒకేసారి తన వేడిని కురిపించటం కుదరదని కాబోలు ఒక్కసారి భళ్ళున నిప్పుల్ని వాంతి చేసుకుంటున్నాడు సూరీడు...

సత్తెయ్య కళ్ళు తెరవలేకపోతున్నాడు. తనీ వేషంకి ఒప్పుకోనని ఎంత చెప్పినా వినకుండా మూర్ఖంగా ప్రవర్తించారు.

కొంపదీసి తనవాళ్ళెవరూ చూడలేదు కదా! చూస్తే... ఎంత జరగాలో అంతా జరుగుతుంది. శవం వేషం వేసినట్లు తెలిస్తే తనింటామె గంజిపొయ్యనని గెంటేస్తుంది. పిల్లలు అంటరానివాడిలా అసహ్యించుకుంటారు.

సత్తెయ్యకి కాసింవాళ్ళ ఏడుపులు, మాటలు లీలగా చెవుల సోకుతున్నాయి.

తన్నిజంగా చనిపోతే యిలాగే కాబోలు అంతా ఏడుస్తారు. అలా అనుకోగానే అప్రయత్నంగా కళ్ళల్లో నీరూరింది.

జనం రద్దీలో అంతారణగొణ ధ్వనిలా వుంది.

ఎవరెవరో విసిరేసిన డబ్బులు గుండెలపై కప్పిన బట్టమీద పడ్తున్నాయి.

మామూలుగా కలెక్షనయిన సొమ్ము అంతా కలసి పంచుకుంటారు. కాని శవం మీద పడినవి ఆ వేషం కట్టినవాడికి యిస్తారు.

గంట స్తంభం దగ్గిర దించి, మరో నలుగురు భుజాలు మార్చుకున్నారు.

పోలీసు బీటు ఎదురుగుండా కిళ్ళీకొట్టు దగ్గరకి వెళ్ళాడు సీతారాముడు.

సీతారాముడి గొంతు మాత్రం ఉండుండి సన్నగా వినిపిస్తూంది సత్తెయ్యకు.

సోడాలు కుయ్యికుయ్యిమన్నాయి.

సీతారాముడు డబ్బులిస్తే కొట్టువాడు వద్దనిచెప్పి తిరిగి యిచ్చేసాడు.

నోరు తెరచి సోడా గురించి అడుగుదామనుకున్నాడు సత్తెయ్య. పోలీసులకీ – ఆడపిల్లల్ని అదేపనిగా అల్లరిపెడ్తున్న స్టూడెంట్సుకీ మధ్య తగాదా రావటంతో సత్తెయ్య మాటలు గొంతుకలోనే దాగుండి పోయినాయి.

వారెవరికీ సత్తెయ్య వూసే లేదు. మళ్ళా నడవసాగారు.

ఇసుకవేస్తే రాలని విధంగా వచ్చిన జనం తొలేళ్ళ సంబరాలలో ఆనందాలు నింపుకుని పులకింతల్తో తేలియాడుతున్నారు.

మందువాసనకి ముక్కు మూసుకుని ఆమడదూరం పారిపోయేవాళ్ళు కూడా – అదొక పద్ధతిలాగో ఆచారమనుకునో కాబోలు మొత్తంపైన మందు పట్టించేస్తున్నారు.

అంతేకాక తాగినట్టు అందరికీ తెలియాలని వెర్రివేషాలు వేయటంతో ప్రారంభించి – భూతాల వైద్యుడిలా దెయ్యం ఆవహించినట్టు పూనకాలు ఊపులు మొదలెట్టడంతో పండుగ హోరెత్తిపోతోంది.

పట్టపగలే ప్రజ యింతలా ఎలా ఊగిపోతున్నారో – అర్థంకానివాళ్ళు అబ్బురపాటుతో నిల్చుండిపోతున్నారు.

ఇంతమంది ఉత్సాహాలు వెల్లివిరిసేలా నాట్యాలాడ్తూ – పొంగిపొరలే సెలయేటిలా త్రుళ్ళుతూంటే పాడెపైన శవంవేషం కట్టిన సత్తెయ్య మాత్రం కృంగిపోతున్నాడు. పెళపెళ్ళాడే ఎండ తీవ్రతకి తట్టుకోలేక – ఆరని జ్వాలలా దహించేస్తున్న దాహంతో డస్సిపోతున్నాడు.

వెంకట్రాముడి ఆధ్వర్యంలో వున్నాయి వేషాలన్నీ. ఏ వీధిలో వేషాలెలా నడుస్తున్నదీ ఎప్పటికప్పుడు ఎలక్షన్స్‌లో ఘడియ ఘడియకీ వచ్చే రేడియో వార్తల్లా – వేగుల్లాంటి మనుషుల ద్వారా వర్తమానాలు అందుతున్నాయి.

ఓ చోట జనం బాగా రద్దీగా వుండి ట్రాఫిక్ జామ్ అయిపోయింది. ఆ ఎదురుగా లంకవీధి పులివేషం అందర్నీ ఉత్సాహపూరితుల్ని చేసి పరవశింపచేస్తూంది.

వెంకట్రాముడి దగ్గరకి అదే సమయంలో సాయిబు పరిగెత్తుకొచ్చాడు.

"బాసూ! బాసూ! మనోళ్ళందరి ఏసాలు బాగానే వున్నె, రంగిరీజీది వోళ్ళు దొంగపోలీసు ఏసినారు గదా!

మనోళ్ళు ఏడకిపోతే ఆడకే కాంపిటేసనుగ వత్తున్నారు. ఏటి సెయ్యటమో తెల్డంలేదు" జవాబుకోసం ఎదురుచూసి, ఎంత వేగిర్నం వెళ్ళిపోదామనా అన్నట్టున్నాడు సాయిబు.

బక్కపల్చగా వుండే సాయిబు గుమ్చీ దగ్గర రిక్షాస్టాండు[illegible]కొంచెం బెదురు స్వభావం కలవాడయినా అవసరమొస్తే ఎవరి మీదైనా తిరగబడగలడు. కానీ వెంకట్రాముడి సలహామీదే రంగంలోకి దిగుతాడు.

తన పర్సెంటేజి చేతి కందలేదని మండిపడ్డ ఎమ్మెల్యేలా మండిపడ్డాడు వెంకట్రాముడు.

"అయినా మనోళ్లు చేతగాని వెధవల్లా ఎందుకూరుకోవాలి. ప్రతి ఏడూ జరిగే రగడేగా. నాల్గు తగిలిస్తే వాళ్లే అడ్డులేస్తారు. యింకా ముదిర్తే కబురు తీసుకురా!" అని పంపేసాడు వెంకట్రాముడు.

అతనికిప్పుడు రంగిరీజు వీధి వాళ్ళ వైపే దృష్టి మళ్ళింది.

ఈ మధ్యనే రిక్షాలు లాగడంలో కుదిరిన వెంకట్రాజు, నాగులు ముక్కు పచ్చలారని పసివాళ్ళు, వాళ్ళ తల్లిదండ్రుల చేతకానితనానికి నిదర్శనంగా – ఉదర పోషణ నిమిత్తం చెమటోడుస్తున్నారు.

వారికి తోడెవరూ లేక సాయిబుని పంపాడు. నడివయస్కుడయిన సాయిబేమో వెన్నపూస. అందుకే వెంటనే ఇళ్ళుతగలబడిపోయినట్లుగా బెదిరిపోయి పరుగెత్తుకొచ్చాడు.

ఇంతలో వెంకట్రాముడి ధ్యాసను పోగొట్టినాయి సీతారాముడి మాటలు

"గురూ! దక్కినివీధిలో మన రత్తాలు గాడి పులేసకం చూసిన అయినాడ సరపంచుగారు రెండొంద లిచ్చినారంట" అన్న మాటకి అప్పుడే విచ్చుకుంటున్న ఆడవిమల్లిలా మెరిసింది వెంకట్రాముడి గుండె.

చిన్న వీధి దగ్గిర సిమెంటు షాపు దగ్గిర ఆగారు. పెదబాబుగారు కన్యకాపరమేశ్వరి కోవెల దగ్గర సిమెంట్ వ్యాపారంలో పేరు మోసారు.

ఆయన బ్యాంకుల్లో ఎంత దాస్తాడో అంత ఉదారుడూ అనిపించుకున్నాడు.

అందుకే ఆయన వెంకట్రాముడ్ని చూడ్డంతోటే సినిమాయాక్టర్ని చూసి అభిమానులు స్వాగతం పల్కినట్లుగా ఆప్యాయంగా పిలిచి "ఏరా! ఈసారి శవం వేషం ఎవరు కట్టారు" అడిగారాయన.

"సత్తెయ్యనీ... రేపోమాపో ఈ శవం ఏసకం నిజం సేసుకునేవోడేలెండి..." అని ఎగతాళిగా అన్నాడు కాసిం. మిగతావాళ్ళు పకపకా నవ్వారు. ఆయన సైతం....

ఈ మాటలు సత్తెయ్య చెవినబడి సర్పదష్టలా అయిపోయాడు.

జెన్నిజమే. తన శక్తంతా యీ రిక్షా లాగడానికే ఉడిగిపోయింది. ఇంక మిగిలిందేంటి? ఈ ఎముకల పోగు తప్ప.

సత్తెయ్య పెదాలు తడుపుకుందికి నోట్లో నాలుకని అటుయిటు ఆడించినా లాలాజలం కూడా ఎండదెబ్బకి యిగిరిపోయిందేమో...! అతని ప్రయత్నం వమ్మయింది.

గుక్కెడు నీళ్లు కావాలి తనకి. ఇందాకే చెబుదామనుకుంటే అవకాశం జారిపోయింది. ఇప్పుడు చెప్పాలంటే గొంతు పెగలట్లేదు.

అయినా వాళ్ళకి తెలియొద్దూ! ఇంత ఎండలో తన ముసలిప్రాణం దాహంతో అలమటించిపోతుందని!

క్రితంసారి పండక్కి శవం వేషం కట్టిన జగ్గయ్యకి ఎప్పటికప్పుడు ప్రతీ సెంటరు కాడ తనే సోడాలు కొట్టించి యిచ్చాడు.

కానీ తనని ఎవరూ పట్టించుకోరేం? వాళ్ళ డబ్బా.... వాళ్ళ సర్దాలేనా...

ఏ క్షణం ఎలా జరగాలలో దేవుడే రాసి పెడ్తాడంటే ఇదే కాబోలు... అన్న కర్మసిద్ధాంతం సత్తెయ్య మనసు మూరు మూలల్లోంచి పాకింది.

"తాలుకా ఆఫీసుకి పోవాల" అని సీతారాముడు చెప్పడంతో మార్కెట్టు వదిలారు.

అంతవరకూ ఎవరెవరూ ఎంత డబ్బు ఇస్తున్నదీ. యింకా అరువులెన్నో వ్రాసి దాన్ని వెంకట్రాముడికి చూపిస్తున్నాడు మిరియాలు.

వాళ్ళలో అయిదోక్లాసు పోయినా ఆపాటి ఈపాటి అక్షరజ్ఞానం నిలబెట్టుకున్నవాడు మిరియాలు ఒక్కడే!

ప్రతీ వేషంతో వెళ్లే బాచ్‌తో ఒక చదువుకున్న రిక్షావాడు తప్పక వుంటాడు. చిన్నగా చీకటి పడుతోంది. వింతకాంతులతో పట్టణం నైగనిగ్యాన్ని ప్రతిబింబిస్తోంది.

తెల్లారేదాకా ఊరంతా తిరిగి అలసిపొలసిపోయిన అన్ని రిక్షాస్టాండు వేషాల వాళ్ళూ అయ్యకోనేరు గట్టు దగ్గరకు చేరారు.

గుమ్చీ దగ్గర కోటీశ్వరరావు రుక్మిణీకళ్యాణం హరికథ జరుగుతోంది. వేషాలు పూసుకున్నవాళ్ళంతా కొబ్బరినూనె రాసి రంగులు గోక్కుంటున్నారు.

వెంకట్రాముడు మిరియాలు సాయంతో లెక్కలు కడుతున్నారు. ఏ వేషంకి ఎంత కలెక్షన్ వచ్చిందో చూస్తున్నారు. గత ఏడాదికి ఈ ఏడాదికీ మెరుగో తరుగో బేరీజు వేసుకుంటున్న వాళ్ళు మరికొందరు.

కాసింవాళ్ళు ఏడోవీధి మిగిలిపోయిందని వెళ్ళివచ్చి పాడె దించి – "అమ్మయ్య చచ్చాంరా! మొయ్యలేక – వుదయం తేలిగ్గా వున్నాడనుకున్నాంగాని సత్తెయ్య శవంలా రాన్రాను బరువెక్కిపోనాడ్రా" అని భుజం మీద చింకి తువ్వాలుతో ఓసారి మొహంతుడుచుకున్నాడు కాసిం.

ఏ వేషానికి ఎక్కువ కలెక్షన్ లభించిందోనని ఆత్రుతగా నిరీక్షిస్తున్నారు. ఓట్లు

లెక్కింపుకోసం వేచివున్న ఓటర్ల లాగ.

గత ఏటికంటే అధికంగా కలెక్షన్స్ రావటంతో అంతా ఈలలు కేకలుతో గగ్గోలెత్తిపోయింది ప్రాంతం.

అంతేకాక సత్తెయ్య వేసిన శవం వేషం ఎక్కువ సొమ్ము చేసుకుందని ప్రకటించాడు వెంకట్రాముడు.

కాసిం సంబరం పట్టలేక రావిచెట్టు దగ్గరకు పరిగెత్తి "సత్తెయ్యా సత్తెయ్యా లేలే! నీకు మంచి వార్త చెబుతా!" అని కట్లు విప్పాడు.

" ఒరే! నీవేషం ఈ క్షణంతో అయినాదిగాని లేలే! అక్కడందరూ కులాసాగా గెంతుతున్నారు. ఏట్రా! లేవ్వా! అయితే చెబుతానుండు... ఉహు! కదల్దేటి?..అ...చచ్చావా..." భయంతో అని కాసిం ఆదుర్దాగా వెంకట్రాముడి దగ్గరికెళ్ళి చెప్పాడు.

"ఆ అనుకున్నట్టే అయినాది బకెట్ తన్నేసాడు ముసలాడు" అన్నాడు సీతారాముడు.

"ఏసకం నిజం చేసినాడు" మిరియాలు నవ్వాడు.

వెంకట్రాముడు మాత్రం కదలకుండా ఇంకా నోట్లు లెక్కపెడుతూనే వున్నాడు.

(యువ మాస పత్రిక – జనవరి 1989)